ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
EVENING 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 89 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | శనివారం 02 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ముగిసిన నారా లోకేశ్ అమెరికా పర్యటన

అమెరికాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పెట్టుబడుల యాత్ర విజయవంతంగా ముగిసింది.



న్యూయార్క్ , నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): అమెరికాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పెట్టుబడుల యాత్ర విజయవంతంగా ముగిసింది. వారం రోజుల పర్యటనలో 100కు పైగా దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ఆయన వరుస భేటీలు నిర్వహించారు. పరిశ్రమల ప్రతినిధుల్లో రాష్ట్రంలో పెట్టుబడులపై నమ్మకం కలిగించారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలతో పాటు సీఎం చంద్రబాబు విజన్ను ఆయన ఆవిష్కరించారు. ఐదేళ్ల విధ్వంసక పాలనలో దెబ్బతిన్న బ్రాండ్ ఏపీని పునరుద్ధరించడమే లక్ష్యంగా లోకేశ్ పర్యటన సాగింది. ఆయన ప్రతిపాదనలపై పలు దిగ్గజ కంపెనీలు సానుకూల సంకేతాలు ఇచ్చాయి. ఈ భేటీల ఫలితంగా జనవరిలో దావోస్లో జరిగే పెట్టుబడుల సదస్సులో పెద్దఎత్తున ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని లోకేశ్ తెలిపారు. చివరి రోజున న్యూయార్క్ ని విట్ బై హెూటల్లో పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్ చైర్మన్ పూర్ణ ఆర్ సగ్గుర్తిని కలవడానికి ట్రాఫిక్ రద్దీలో కాలినడకన వెళ్లారు. బ్లూప్రింట్తో వచ్చే పరిశ్రమలకు ఎటువంటి జాప్యం లేకుండా వెనువెంటనే అనుమతులు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డు చురుగ్గా పనిచేస్తోందని తెలిపారు. పెట్టుబడులకు అన్నివిధాలా అనుకూలమైన వాతావరణం నెలకొన్న ఏపీని ఒకసారి సందర్శించాల్సిందిగా అమెరికా పారిశ్రామికవేత్తలకు లోకేశ్ విజ్ఞప్తి చేశారు.ముగిసిన నారా లోకేశ్ అమెరికా పర్యటన

# మూడేళ్ల బాలికపై హత్యాచారం ఘటన.. నిందితులపై కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు

తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో మూడేళ్ల బాలికపై హత్యాచారం ఘటనపై హెూంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



అమరావతి, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడేళ్ల బాలికపై హత్యాచారం ఘటనపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చిన్నారి కుటుంబానికి రూ.10 లక్షలు అందజేయాలని కలెక్టర్ను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం బాధిత కుటుంబానికి హెూంమంత్రి అనిత ఇందుకు సంబంధించిన చెక్కును అందజేయనున్నారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో మూడేళ్ల బాలికపై హత్యాచారం ఘటనపై హెూంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని చిన్నారికి చాక్లెట్లు ఆశ చూపి దారుణానికి పాల్పడటం హేయమన్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మృతి చెందిన బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై సత్వరమే విచారణ జరిపి నిందితుడికి శిక్ష పడేలా చేస్తామని అనిత తెలిపారు.

# ఏ భాజపా పాలిత రాష్ట్రంతో పోల్చినా మాదే రికార్డు.. మోదీ విమర్శలకు రేవంత్ రిప్లై

ప్రధాని మోదీ విమర్శలకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్రెడ్డి సమాధానమిచ్చారు.



హైదరాబాద్, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): ప్రధాని మోదీ విమర్శలకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్రెడ్డి సమాధానమిచ్చారు. "అధికారంలోకి వచ్చిన 2 రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల సదుపాయాన్ని అమల్లోకి తీసుకొచ్చాం. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు రూ.3433 కోట్లు ఆదా అయింది. ఏడాది కాకముందే దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ అమలు చేశాం. 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. ఇందులో భాగంగా కేవలం 25 రోజుల్లోనే రూ.18 వేల కోట్లు జమ చేశాం. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాం. భాజపా పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ ధరలు అధికంగా ఉన్నాయి. తెలంగాణలో రూ.500కే సిలిండర్ ఇస్తున్నాం. ఇప్పటివరకు 43 లక్షల మందికి సిలిండర్ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. అధిక సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం. గ్రూప్స్ పరీక్షలను రెగ్యులర్గా నిర్వహిస్తున్నాం. 11 నెలల్లోనే 50 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టాం. నియామకాల్లో ఏ భాజపా పాలిత రాష్ట్రంతో పోల్చినా మాదే రికార్డు. హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. మూసీ పునరుజ్జీవానికి నడుం బిగించాం. కబ్జాకు గురైన నీటి వనరులను సంరక్షిస్తున్నాం. ఫ్యూచర్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్ ఖరారు చేస్తున్నాం. స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానంపై పవిత్రమైన నిబద్ధతతో ఉన్నాం." అని రేవంత్రెడ్డి తెలిపారు.

# నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు లాంచీప్రయాణం.. టికెట్ ధరలివే..!

నాగార్జునసాగర్, పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ఎదురుచూస్తున్న నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు బోటు ప్రయాణాన్ని కార్తిక మాసం తొలిరోజు తెలంగాణ పర్యాటక శాఖ ప్రారంభించింది. గత ఐదేళ్లుగా ప్రణాళికలు వేసినప్పటికీ.. సాగర్లో సరైన స్థాయిలో నీరు లేకపోవడం, కరోనా మహమ్మారి తదితర కారణాలవల్ల వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదిలో.. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ వరకు గరిష్ఠ స్థాయిలో నీటి లభ్యత ఉంది. దీంతో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ లాంచీ ప్రయాణాన్ని ప్రారంభించింది.

పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ఎదురుచూస్తున్న నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు బోటు ప్రయాణాన్ని కార్తిక మాసం తొలిరోజు తెలంగాణ పర్యాటకశాఖ ప్రారంభించింది.



దాదాపు 120 కిలోమీటర్ల దూరం ఉండే ఈ ప్రయాణానికి మొదటి రోజు రాష్ట్రంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు.

నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించేలా లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. మరొక మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సేవలను కూడా పర్యాటకాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో 120 మంది ప్రయాణించేలా ఏసీ లాంచీని అధికారులు ఇవాళ ప్రారంభించారు. అక్కణ్నుంచి శ్రీశైలం వరకు 120 కిలోమీటర్ల మేర 7 గంటలపాటు ఈ ప్రయాణం ఉంటుంది. లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా టికెట్ ధరలు నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ తెలిపింది.

# సీఎం చంద్రబాబు ఏపీని అభివృద్ధికి సూచికగా మారుస్తున్నారు: ఎమ్మెల్యే జీవీ

వైకాపా అధినేత జగన్ గత ఐదేళ్ల పాలనలో ఏపీని విధ్వంసానికి, దోపిడీకి మారుపేరుగా మారిస్తే.. నేడు సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధికి సూచికగా మారుస్తున్నారని ఎమ్మెల్యే జీవీ ఆంజనే-యులు అన్నారు.



వినుకొండ, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): వైకాపా అధినేత జగన్ గత ఐదేళ్ల పాలనలో ఏపీని విధ్వంసానికి, దోపిడీకి మారుపేరుగా మారిస్తే.. నేడు సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధికి సూచికగా మారుస్తున్నారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఏపీ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించటంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు మహర్దశ పట్టనుందన్నారు. శనివారం కొండ్రముట్ల-దుర్గి రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.4వేల చొప్పున పెన్షన్ ప్రతి నెలా 1వ తేదీన పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పన ద్వారా జీవన ప్రమాణాలు పెంపొందించేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. గత పాలనలో రహదారుల నిర్వహణను జగన్ పట్టించుకోలేదని, 'కనీసం ఒక కొత్త రోడ్డు అయినా వేశారా? ఒక్క రోడ్డుకు గుంతలు పూడ్చారా..' అని జీవీ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులకు సీఎం చంద్రబాబు రూ.826 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. 2014-2019లో చంద్రబాబు పాలనలో రూ.12 వేల కోట్లతో రోడ్ల నిర్మాణాలు జరిగితే.. వైకాపా హయాంలో గుత్తేదారులకు జగన్ బిల్లులు కూడా చెల్లించలేదని ఏద్దేవా చేశారు. అప్పులున్నా ఏపీలో అభివృద్ధి పనులు ఆగడంలేదన్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వాగులు, కుంటలు, స్మశాన స్థలాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి, కనీసం ఒక్క కాలనీ కూడా పూర్తి చేయలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.4,500 కోట్ల నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు కృషి చేస్తున్నారని చెప్పారు.

# దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలి: వీసీలతో సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను సమూలంగా ప్రక్షాళన చేసి.. దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలని కొత్త వైఎస్ ఛాన్సలర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.



హైదరాబాద్, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను సమూలంగా ప్రక్షాళన చేసి.. దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలని కొత్త వైఎస్ఛాన్సలర్లకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దిశానిర్దేశం చేశారు. కొత్తగా నియమితులైన ఉపకులపతులు సీఎం రేవంత్రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంతకాలంగా యూనివర్సిటీలపై నమ్మకం తగ్గుతోందని, మళ్లీ విశ్వాసం పెంచేలా పనిచేయాలన్నారు. వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని ఉపకులపతులకు సీఎం సూచించారు. యూనివర్సిటీల్లో ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం కోసం అవసరమైతే కన్సల్టెన్సీలను నియమించుకొని నివేదిక తయారు చేసుకోవాలన్నారు. ఒత్తిళ్ల ప్రభావంతో వీసీలను నియమించలేదని.. ప్రతిభ, సామాజిక సమీకరణలనే పరిగణనలోకి తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వీసీలు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని.. తప్పులు చేస్తే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంచి పని చేయడానికి వైస్ ఛాన్సలర్లకి స్వేచ్ఛ.. ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో వీసీలను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునే వారని.. ఇప్పుడు ఆపరిస్థితి లేదని సీఎం వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టాలని.. విద్యార్థులను గమనిస్తూ అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి సూచించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# సీఎం చంద్రబాబు
## నేటి విజయనగరం జిల్లా పర్యటన రద్దు..

అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో నేడు సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. శ్రీకాకుళంలోని ఆర్అండ్బీ అతిథి గృహంలో రాత్రి బస చేశారు.




విశాఖ, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో నేడు సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. శ్రీకాకుళంలోని ఆర్అండ్ బీ అతిథి గృహంలో రాత్రి బస చేశారు. ఇక్కడి నుంచి నేరుగా అనకాపల్లి జిల్లాకు ఆయన చేరుకోనున్నారు. చంద్రబాబు నేటి విజయనగరం జిల్లా పర్యటన రద్దయింది. విజయనగరం స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన కారణంగా పర్యటన రద్దయింది. సీఎం పర్యటన రద్దయినట్లు మంత్రి కొండపల్లి కార్యాలయం నుంచి ప్రకటన వచ్చింది. ఉదయం 11.15 గంటలకు హెలికాప్టర్లో చింతలగోరువానిపాలెంలోని లారస్ సంస్థ వద్దకు చంద్రబాబు చేరుకోనున్నారు. సంస్థ నిర్వహించే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అనకాపల్లి జిల్లా వెన్నెలపాలేనికి చేరుకోనున్నారు. రహదారి గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 1.25 గంటలకు హెలికాప్టర్లో రుషికొండ వెళ్లి ఏపీ టూరిజం రిసార్ట్స్ను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విశాఖ కలెక్టరేట్లో అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు. ఇందులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు.

# ప్రజలను పాలించడం అంటే.. ఫేస్ బుక్ లైవ్లో కనిపించడం కాదు: ఏక నాథ్ శిందే

మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల వేళ ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేపై తీవ్ర ఆరోపణలు చేశారు.



ముంబయి, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): మహారాష్ట్రలో ఎన్నికల వేళ రాజకీయాలు వేడెక్కాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈక్రమంలో ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేపై తీవ్ర విమర్శలు చేశారు. ఈమేరకు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యానించారు. 'నేను మహావికాస్ అఘాడి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండేవాణ్ని. ఆ ప్రభుత్వం బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాలకు విరుద్ధంగా పని చేస్తుంది. శివసేన, భాజపాలు సరైన మార్గంలోనే వెళుతున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే ఆయన వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నారు. ఇది బాలాసాహెబ్ ఎప్పుడూ కోరుకోలేదు. శివసేన కార్యకర్తలుగా పార్టీ క్రమశిక్షణను అనుసరిస్తూ.. మార్పు అవసరమని గ్రహించాం. అందులో భాగంగానే భాజపాతో పొత్తు పెట్టుకున్నాం. సీఎంగా ప్రజలకు సేవ చేయడం అంటే ఆఫీసులో ఉండి, ఫేస్బుక్ లైవ్లో ప్రభుత్వాన్ని నడపడం కాదు. ప్రజల మధ్యలో ఉండి పాలన చేయాలి' అని ఉద్ధవ్ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్యకు సంబంధించిన నిందితులను వదిలిపెట్టేది లేదని ఏక్నాథ్ శిందే పేర్కొన్నారు. 'శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఈ ఘటన చాలా దురదృష్టకరం. ఈ హత్యకు సంబంధించిన పలువురు నిందితులు ఇప్పటికే అరెస్ట్ అయ్యారు. ఇందులో భాగస్వాములైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది' అని తెలిపారు. ఇక, మొత్తం 288 స్థానాలకు ఈనెల 20న మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 23న ఓట్ల లెక్కింపు జరగనుంది.

### ఈసారి మాత్రమే కాదు.. మరో పదేళ్లపాటు
# సీఎంగా రేవంత్ రెడ్డి: మల్లు రవి

నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, భాజపా శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.




హైదరాబాద్, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి భాజపా శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈసారి మాత్రమే కాదు.. మరో పదేళ్లపాటు సీఎంగా కొనసాగుతారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై మహేశ్వర్ రెడ్డి మాట్లాడిన తీరు అతని రాజకీయ అజ్ఞానానికి పరాకాష్ఠ అని పేర్కొన్నారు. మహేశ్వర్ రెడ్డికి భాజపాలో పని ఏమీ లేక పగటి కలలు కంటూ ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేస్తున్నారంటూ.. మల్లు రవి ఓ ప్రకటనను విడుదల చేశారు. భాజపాలో రోజురోజుకూ ముదిరిపోతున్న విభేదాలు, వర్గపోరు నుంచి అందరి దృష్టిని మరల్చేందుకు ఇలాంటి జాతకాలు చెబుతున్నారని దుయ్యబట్టారు.

## ప్రైవేట్ పాఠశాలలో బాలుడి అనుమానాస్పద మృతి



జహీరాబాద్ లోని ప్రైవేట్ పాఠశాలలో ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.

సంగారెడ్డి , నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): జహీరాబాద్లోని ప్రైవేట్ పాఠశాలలో ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పాఠశాల వసతి గృహంలో బాలుడి (12) మృతదేహాన్ని గుర్తించారు. అతడి తల, పెదవులు, కనుబొమ్మలపై గాయాలున్నాయి. హాస్టల్లోని మంచంపై నుంచి పడి మృతి చెందాడని పాఠశాల యాజమాన్యం చెబుతోంది. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనల్లో విద్యార్థి సంఘాలు కూడా పాల్గొన్నాయి.

# రహదారిపై గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు



అనకాపల్లి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెన్నెలపాలంలో రహదారిపై ఉన్న గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనకాపల్లి, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): అనకాపల్లి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెన్నెలపాలంలో రహదారిపై ఉన్న గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం వెంట మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 1.25 గంటలకు హెలికాప్టర్లో చంద్రబాబు రుషికొండ వెళ్లి ఏపీ టూరిజం రిసార్ట్స్ను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విశాఖ కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇందులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు.

## వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్పై పోలీసులకు ఫిర్యాదు చేసిన వాసిరెడ్డి పద్మ



వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్పై ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు. చేశారు.

విజయవాడ, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్పై ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచార బాధితుల పేర్లను మాధవ్ వెల్లడిస్తున్నారని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అత్యాచార బాధితుల పేర్లు వెల్లడించడం దుర్మార్గమని, వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. రాజకీయపరమైన నిర్ణయాన్ని వారంలో ప్రకటిస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తనకు ఆప్తులు అని చెప్పారు. వాసిరెడ్డి పద్మ ఇటీవల వైకాపా పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా ఆమె వైకాపా అధ్యక్షుడు జగన్పై తీవ్ర విమర్శలు చేశారు.

# కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నందవరం మండలం ధర్మాపురం వద్ద ఓ కారు ఆటోను ఢీకొంది.

ఎమ్మిగనూరు , నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నందవరం మండలం ధర్మాపురం వద్ద ఓ కారు ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలోని ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా.. ఓ బాలికకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతులను వీర నాగమ్మ(60), గౌరమ్మ (61) జేబీ(32)లుగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన బాలిక రజియాను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారు మితిమీరిన వేగమే కారణంగా తెలుస్తోంది. ప్రమాద ధాటికి కారు, ఆటో ఎగిరిపడి రహదారి పక్కన పడ్డాయి.

## హైదరాబాద్లో కొత్తగా మరో స్కైవాక్.. ఎక్కడంటే..?



పరేడ్ గ్రౌండ్ మెట్రోరైలు స్టేషన్ వద్ద కొత్తగా స్కైవాక్ నిర్మించనున్నారు.

నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): పరేడ్ గ్రౌండ్ మెట్రోరైలు స్టేషన్ వద్ద కొత్తగా స్కైవాక్ నిర్మించనున్నారు. మెట్రో జంక్షన్గా ఈ స్టేషన్ నుంచి నిత్యం అధిక సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఫ్లైఓవర్ కారణంగా స్టేషన్ నుంచి కిందికి వచ్చి రోడ్డు దాటాల్సివస్తోంది. అత్యంత రద్దీ ప్రాంతం కావడం.. రెండోవైపు ఎల్అండ్ టీ మెట్రోకు కేటాయించిన భూములు ఉండటంతో అనుసంధానం కోసం స్కైవాక్ నిర్మించనున్నారు. పైవంతెనలున్న చోట మెట్రో స్టేషన్లను రహదారికి ఒక వైపు నిర్మించారు. ప్యారడైజ్ స్టేషన్ను ఇలాగే సికింద్రాబాద్ పీజీ కళాశాలవైపు నిర్మించారు. రహదారి దాటి రెండోవైపు రావాలంటే చాలా కష్టంగా ఉండేది. ప్రయాణికుల ఇబ్బంది తొలగించేందుకు ఇక్కడ స్కైవాక్ నిర్మించారు. ఇదే మాదిరి పరేడ్ గ్రౌండ్ స్టేషన్ వద్ద కూడా కొత్తగా నిర్మించబోతున్నారు.

### పేదల ఇళ్లు ఎందుకు కూలగొట్టారని
# ప్రశ్నించినందుకు కేసులా?: హరీశ్ రావు



శ్రీనివాస్ గౌడ్ తో పాటు ఇతర భారాస నేతల పై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు.

హైదరాబాద్, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): శ్రీనివాస్ గౌడ్ తో పాటు ఇతర భారాస నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. పేదల ఇళ్లు ఎందుకు కూలగొట్టారని ప్రశ్నించినందుకు కేసులు పెట్టారా..? అని ప్రశ్నించారు. కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం హేయమన్నారు. ప్రజాసమస్యలపై పోరాడుతున్న వారి గొంతు నొక్కడమేనా ప్రజాపాలన? అని నిలదీశారు. అక్రమ కేసులకు, బెదిరింపులకు భారాస భయపడదని చెప్పారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరపున నిలదీస్తూనే ఉంటామన్నారు. భారాస నేతలపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని హరీశ్రావు డిమాండ్ చేశారు.


## రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి: శ్రీనివాస్ గౌడ్

ప్లానింగ్ కమిషన్, బీసీ కమిషన్పై ప్రభుత్వం 2 జీవోలు మాత్రమే ఇచ్చిందని మాజీ మంత్రి, భారాస నేత శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

హైదరాబాద్, నవంబర్ ,02 (రిపబ్లిక్ న్యూస్): ప్లానింగ్ కమిషన్, బీసీ కమిషన్పై ప్రభుత్వం 2 జీవోలు మాత్రమే ఇచ్చిందని మాజీ మంత్రి, భారాస నేత శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై చట్టం చేస్తే సహకరిస్తామన్నారు. చట్టం లేకుండా రిజర్వేషన్లు పెరగవని పేర్కొన్నారు. బిహార్, మహారాష్ట్రలో రిజర్వేషన్ల పెంపును కోర్టులు కొట్టేశాయని గుర్తుచేశారు. "బీసీ కమిషన్ జిల్లాలకు పోతే ఎవరూ పట్టించుకోవడం లేదు. కమిషన్ను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దాన్ని నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి" అని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు.

# అండర్ వరల్డ్ నుంచి సల్మాన్కు బెదిరింపులు: సోమీ అలీ

**అండర్ వరల్డ్ డాన్ దావుద్ ఇబ్రహీం ని ఉద్దేశించి బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ఖాన్ మాజీ ప్రేయసి, నటి సోమీఅలీ మాట్లాడారు. అండర్వరల్డ్ నుంచి సల్మాన్కు గతంలో బెదిరింపులు వచ్చాయని ఆమె అన్నారు.**



అండర్ వరల్డ్ డాన్ దావుద్ ఇబ్రహీం ని ఉద్దేశించి బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మాజీ ప్రేయసి, నటి సోమీ అలీ మాట్లాడారు. అండర్వరల్డ్ నుంచి సల్మాన్కు గతంలో బెదిరింపులు వచ్చాయని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "నేను బాలీవుడ్లో వర్క్ చేసిన సమయంలో దావుద్ ఇబ్రహీం, చోటా షకీల్ గురించి చాలామంది నటీనటులు మాట్లాడుకోవడం విన్నా. అయితే వారెవరూ కూడా వీరి గురించి ప్రత్యక్షంగా మాట్లాడుకునేవారు కాదు. 'అండర్ వరల్డ్' అని పరోక్షంగా చెప్పేవారు. సల్మాన్తో నేను కొన్నేళ్లపాటు డేటింగ్ లో ఉన్న విషయం తెలిసిందే. గ్యాలెక్సీ నివాసంలో మూడేళ్లు మేమిద్దరం కలిసే ఉన్నాం. ఆ సమయంలో ఆయనకు ఓసారి అండర్వరల్డ్ నుంచి బెదిరింపు కాల్ వచ్చింది. ఫోన్ ఎవరు చేశారో తెలియదు కానీ.. అతడు మాత్రం బెదిరింపులకు పాల్పడ్డాడు. 'సల్మాన్కు చెప్పు.. ఆయన ప్రియురాలిని మేము కిడ్నాప్ చేయనున్నామని" అన్నారు. అతడి మాటలు నన్నెంతో భయపెట్టాయి. వెంటనే ఆ విషయాన్ని సల్మాన్కు చెప్పా. ఆయన కూడా కంగారుపడ్డారు. పరిస్థితులు చక్కబడేలా చేశారు. ఆ ఫోన్ చేసిన వ్యక్తి ఎవరో తెలుసుకుందామని ఎన్నోసార్లు ప్రయత్నించా. సల్మాన్ను అడిగా. 'ఈ విషయాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది' అని ఆయన చెప్పారు" అని సోమీ అలీ తెలిపారు. సోమీ అలీ పాకిస్థానీ అమెరికన్ నటి. పలు బాలీవుడ్ చిత్రాల్లోను నటించారు. 'ఆందోళన్', 'మాఫియా' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. సల్మాన్ఖాన్ - సోమీ అలీ ప్రధాన పాత్రల్లో గతంలో ఓ చిత్రాన్ని ప్రకటించారు. చిత్రీకరణ దశలో ఉండగానే ఈ సినిమా ఆగిపోయింది. అయితే, ఈ సినిమా షూటింగ్ సమయంలోనే సోమీ - సల్మాన్ ప్రేమలో పడినట్లు అప్పట్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈవిషయంపై ఓ సందర్భంలో సోమీ స్పందిస్తూ.. 'సల్మాన్ అంటే నాకెంతో ఇష్టం. సల్మాన్కు నా ప్రేమను తెలియజేశా' అని చెప్పారు. ఆ తర్వాత ఏమైందో ఏమో తెలియదు వీళ్లిద్దరూ విడిపోయారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# 'పుష్ప 2'లో శ్రీలీల ?.. థియేటర్లు దద్దరిల్లిపోవాల్సిందే అంటోన్న నెటిజన్లు

**ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'పుష్ప ది రూల్'ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం నెట్టింట వైరల్గా మారింది.**



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పుష్ప ది రూల్' 2021లో విడుదలైన 'పుష్ప ది రైజ్ కు సీక్వెల్గా వస్తోన్న ఈ సినిమా కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో 'పుష్ప 2'కు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్ గా మారింది. ఈ భారీ ప్రాజెక్టులో యువ నటి శ్రీలీల భాగమైనట్లు తెలుస్తోంది. సుకుమార్ సినిమా అంటే స్పెషల్ సాంగ్స్కు ప్రత్యేక ఆకర్షణ ఉంటుంది. ఇప్పటివరకూ ఆయన తెరకెక్కించిన పలు సినిమాల్లోని.. 'అ అంటే అమలాపురం', 'రింగ రింగా', 'జిగేల్ రాణి' వంటి పాటలు సూపర్హిట్ అందుకున్నాయి. 'పుష్ప ది రైజ్లోని 'ఊ అంటావా మావ' గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాస్ అవతార్ లో అల్లు అర్జున్, క్లాసీ లుక్లో సమంత స్టెప్పులు అందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. 'పుష్ప ది రూల్ లో కూడా అదేస్థాయిలో ఓ సాంగ్ ఉంటుందని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఇందులో ఎవరు కనిపించనున్నారనే విషయంలో బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్ తోపాటు పలువురు తారల పేర్లు వినిపించాయి. పారితోషికం కారణంగా శ్రద్ధాకపూర్ ఈ టీమ్లో భాగం కాలేకపోయారని సమాచారం. ఈక్రమంలోనే చిత్రబృందం శ్రీలీలను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈమేరకు జరుగుతోన్న ప్రచారంపై నెటిజన్లు స్పందిస్తున్నారు. వీరిద్దరికి డ్యాన్స్లో సూపర్ టాలెంట్ ఉంది. కాబట్టి ఈసారి థియేటర్లు దద్దరిల్లిపోవడం పక్కా అనుకుంటున్నారు. మరోవైపు అల్లు అర్జున్ - శ్రీలీల ఇప్పటికే ఓ యాడ్ కోసం వర్క్ చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో 'పుష్ప' తీర్చిదిద్దారు. కూలీగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన పుష్పరాజ్.. ఎర్రచందనం సిండికేట్ను శాసించే స్థాయికి ఎలా వెళ్లాడనే ఆసక్తికర అంశాలతో 'పుష్ప ది రైజ్ చిత్రీకరించారు. ఆ తర్వాత అతడికి ఎదురైన ఇబ్బందులు ఏమిటి? వాటిని ఎలా ఎదుర్కొన్నాడు? అనే అంశాలతో 'పుష్ప ది రూల్ సిద్ధమవుతోంది. రష్మిక కథానాయిక. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1938: అమెరికన్ మితవాద రాజకీయ వ్యాఖ్యాత, రచయిత, సిండికేటెడ్ కాలమిస్ట్, రాజకీయవేత్త పాట్ బుకానన్ జననం.
- 1941: భారతీయ విలేఖరి, రచయిత, రాజకీయవేత్త అరుణ్ శౌరి జననం.
- 1950: ఐర్లాండుకు చెందిన రచయిత జార్జి బెర్నార్డ్ షా మరణం (జ.1856).
- 1956: రంగస్థల కళాకారిణి రాజ్యం. కె జననం.
- 1962: రచయిత, తెలుగు సినిమా దర్శకుడు త్రిపురనేని గోపీచంద్ మరణం (జ. 1910).
- 1965: భారతీయ నటుడు, చలన చిత్ర నిర్మాత, టెలివిజన్ వ్యాఖ్యాత షారుఖ్ ఖాన్ జననం.
- 1976: భారత రాజ్యాంగం యొక్క 42వ సవరణ ను లోక్‌సభ ఆమోదించింది.
- 1984: సర్వోదయ కార్యకర్త, కావూరులోని వినయాశ్రమం వ్యవస్థాపకురాలు తుమ్మల దుర్గాంబ మరణం (జ.1907).



పాట్ బుకానన్



అరుణ్ శౌరి



జార్జి బెర్నార్డ్ షా



త్రిపురనేని గోపీచంద్



షారుఖ్ ఖాన్

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# ఆధునిక టెస్ట్ క్రికెట్లో రిషబ్ పంత్ అత్యంత విలువైన ఆటగాడు: ఆకాశ్ చోప్రా

**టీమ్ ఇండియా యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ పై భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా ప్రశంసల వర్షం కురిపించాడు.**



టీన్ఇండియా యువ వికెట్కీపర్ రిషబ్ పంత్ పై భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా ప్రశంసల వర్షం కురిపించాడు. పంత్ ఆధునిక టెస్టు క్రికెట్లో అత్యంత విలువైన ఆటగాడని పేర్కొన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్లో పంత్ దూకుడుగా ఆడుతూ అభిమానులను అలరిస్తున్న సంగతి తెలిసిందే. ముంబయి వేదికగా న్యూజిలాండ్ తో జరుగుతున్న మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్ లో పంత్ (60బీ 59 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సు) ఆకట్టుకున్నాడు. అతడు 36 బంతుల్లోనే అర్ధ శతకం బాదడం విశేషం. ఈ క్రమంలోనే టెస్టుల్లో కివీస్పై తక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా రికార్డు సాధించాడు. తొలి ఇన్నింగ్స్లో టీమ్ ఇండియా 263 పరుగులకు ఆలౌటైంది."ఆధునిక టెస్టు క్రికెట్లో రిషబ్ పంత్ అత్యంత విలువైన ఆటగాడని నేను నమ్ముతున్నాను. అతను భారత్కే కాదు ప్రపంచ టెస్టు క్రికెట్కు విలువైన ఆటగాడు. బజ్బాల్ను మర్చిపోదాం. పంత్ఆ డుతున్న నిలకడను చూడండి. తన ఆటతీరుతో అభిమానులను అలరిస్తూ టెస్ట్ క్రికెట్కు ఎంతో విలువను జోడిస్తున్నాడు. బ్యాటింగ్ చేసేటప్పుడు పంత్ చాలా స్పష్టమైన ఆలోచనతో ఉంటాడు. అతను బంతిని చూసి పూర్తి విశ్వాసంతో బలంగా బాదుతాడు. రిషబ్ పంత్ వీరేంద్ర సెహ్వాగ్ లాంటి వాడు. సెహ్వాగ్ ఆఫ్ స్పిన్నర్ల బౌలింగ్లో చెలరేగి ఆడేవాడు. ఇప్పుడు పంత్ లెగ్ స్పిన్నర్ల బౌలింగ్లో అదే విధంగా ఆడుతున్నాడు. అతను లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ను ఎదుర్కొనే సమయంలో మైదానం చిన్నదా? పెద్దదా అనే సంబంధం లేకుండా బంతిని స్టేడియం బయటికి పంపిస్తాడు" అని ఆకాశ్ చోప్రా వివరించాడు.

# చెత్త అని పడేసే ఈ పదార్థాలే మొక్కల పాలిట సంజీవని.. ఇలా వాడితే ఏపుగా పెరుగుతాయి...




## హోమ్ డెకరేషన్

ఈ రోజుల్లో చాలా మంది గార్డెనింగ్ ఇష్టపడుతున్నారు. చిన్న స్థలం ఉన్నా సరే అక్కడ మొక్కల్ని పెంచుతున్నారు. నగరాల్లో నివసించే ప్రజలు కుండీల్లో మొక్కల్ని నాటుతున్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజలు తమ పెరట్లో కూరగాయలు, పూల మొక్కలతో పాటు కొన్ని ఔషధపు మొక్కల్ని పెంచతున్నారు. ఇక, సాధారణంగా గార్డెన్లో పూలు, పండ్లతో పాటు ఇతర గార్డెనింగ్ మొక్కల్ని పెంచుతుంటాం. మన పెరడు లేదా బాల్కనీలో కొన్ని రకాల మొక్కలను పెంచడం ద్వారా శారీరక, మానసిక, ఆరోగ్యపరమైన లాభాల్ని పొందవచ్చు. అయితే, మొక్కలు పెంచాలి అన్న ఆలోచన ఉండే సరిపోదు.. వాటిని పెంచడం కూడా తెలిసి ఉండాలి. ఇక, చాలా మంది ఇంట్లో మొక్కలు బాగా పెరగాలన్న ఉద్దేశంతో రకరకాల రసాయనాలు వాడతారు. అయితే, రసాయనాలతో నేల సారం దిబ్బతినడమే కాకుండా.. మొక్కలు కూడా నాశనమయ్యే ప్రమాదముంది. రసాయనాలకు బదులు చెత్త అని పడేసే కొన్నింటిని మొక్కలకు ఎరువులుగా వాడవచ్చు. ఈ సహజమైన పదార్థాలు మొక్కల పెరుగుదల్ని ప్రోత్సాహిస్తాయి. ఇవి సహజమైన ఎరువులుగా పనిచేస్తాయి. ఇంతకీ ఆ పదార్థాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.




### అరటి తొక్క..




మనలో చాలా మంది అరటి పండు తిన్నాక.. తొక్కే కదా అని పారేస్తుంటాం. అయితే, అరటి తొక్కతో చాలా ప్రయోజనాలు ఉంటాయి. మొక్కలు ఏపుగా పెరగడానికి అరటి తొక్కలు వాడుకోవచ్చు. ఇందుకోసం.. అరటి తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దాని మీద కొద్ది మట్టి కప్పండి. అరటి పండు మట్టిలో కలిసిపోయి.. మంచి ఎరువుగా పనిచేస్తుంది. పూల మొక్కలకు కూడా ఇది బాగా పనిచేస్తుందట. పూలు బాగా పెద్దవిగా పెరుగుతాయంట.

### పాలు..



మొక్కలు బాగా పెరగాలంటే పాలను ఎరువుగా వాడుకోవచ్చు. పాలలో ఉండే కాల్షియం, ప్రోటీన్ మొక్కలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇవి మొక్కను ఏపుగా పెంచుతాయి. పాలను ఎరువుగా వాడాలంటే.. ఒక చెంచా పాలను ఒక లీటరు నీటిలో కలపండి. ఇప్పుడు ద్రావణాన్ని మొక్కలకు పోయండి. ప్రతి నెలా ఈ ద్రావణాన్ని పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలుంటాయని నిపుణులు చెబుతున్నారు.

### కూరగాయ తొక్కలు..




ఇంట్లో కూరగాయలు కట్ చేసేటప్పుడు వాటి తొక్కలు పారేస్తుంటాం. అయితే, ఈ వ్యర్థాలు మొక్కల ఎదుగుదలకు తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం కూరగాయ తొక్కల్ని మొక్కల మొదళ్లలో వేసి మట్టి కప్పి ఉంచాలి. ఇలా చేయడం వల్ల వాటిలోని పోషకాలు మొక్కలకు బలాన్ని ఇవ్వడంలో సాయపడాతాయి. దీంతో మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

### గుడ్డు పెంకులు..



చాలా మంది గుడ్డు పెంకుల్ని అనవసర వస్తువుగా భావించి పారేస్తుంటాం. అయితే, గుండు పెంకుతో బోలెడు ప్రయోజనాలు ఉన్నాయి. మొక్కల్లో ఉండే పోషకాల లోపాన్ని తీర్చడానికి గుడ్డు పెంకులను కూడా ఉపయోగించవచ్చు. గుడ్డు పెంకుల్లో కాల్షియం, పొటాషియం, ఇతర పోషకాలు ఉంటాయి. ఇవి మొక్కలకు ఎంతగానో సహకరిస్తాయి. ఈ పోషకాలు మొక్కలు పెరగడానికి, పువ్వులు వికసించడానికి తోడ్పడతాయి. ఇందుకోసం ముందుగా గుడ్డు పెంకులను మెత్తటి పొడిగా చేసుకోవాలి. ఇప్పుడు ఈ పొడిని నీళ్లలో కలిపి గంటసేపు అలాగే ఉంచాలి. తర్వాత ద్రావణాన్ని వడపోసి మొక్కపై పిచికారీ చేయాలి

### ఉల్లి పొట్టు..



ఉల్లి పొట్టు కూడా మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. మొక్కలకు చీడ పడ్డకుండా నివారించడంలో ఉల్లిపొట్టు కీలక పాత్ర పోషిస్తుంది. ఉల్లి పొట్టును అలా మొక్కల పొదల్లో వేసినా సరిపోతుంది. లేదంటే.. ఐదు లీటర్ల గోరు వెచ్చని వాటర్లో ఓ ఇరవై నుంచి ముప్పై గ్రాముల ఉల్లిపొట్టుని వేసి నాలుగు రోజుల పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ వేస్తే.. అవి బాగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

### గ్రీన్ టీ..

ఆరోగ్యానికి మంచి గ్రీన్ టీ మొక్కలకు కూడా బాగా ఉపయోగపడుతుంది. గ్రీన్ టీ మిశ్రమం మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. ఇందుకోసం మీరు చేయాల్సిందల్లా.. వాడేసిన గ్రీన్ టీ పొడిని మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. అంతేకాకుండా.. నీళ్లలో గ్రీన్ టీ వేసి కొన్ని గంటల పాటు పూర్తిగా నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగుని బాగా పిండి.. మిగిలిన నీటిని మొక్కలకు పిచికారీ చేయాలి. ఇలా చేస్తే మొక్కలకు మంచి బలం వస్తుందంటున్నారు నిపుణులు.

**గమనిక..** ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.